

రేపటి కోసం ఎదురుచూస్తూ క్షణమొక యుగంలా గడుపుతున్నారు ఆ దంపతులు. రేపు కొడుకు వస్తాడనే ఊహ వారికి నూతనోత్సాహం కలిగిస్తోంది.

కొడుకు వస్తున్నానని వ్రాసినప్పటి నుంచి, అతనొచ్చే రోజు కోసం—రోజులు లెక్కపెట్టడమే కాలక్షేపంగా మారింది వారికి.

ఆ దంపతులు కన్న ఏకైక పుత్ర రత్నం అరవింద్. బాగా తెలివైనవాడు. బి. ఇ. చదివాడు. మధ్యప్రదేశ్‌లో నెలక్రితమే ఉద్యోగంలో చేరాడు. ఇంతవరకూ ఇన్నాళ్ళ కొడుకుని వదలి వుండని వారు కొడుకు కోసం ఎదురు చూస్తున్నారు. అతన్ని తొందరగా చూడాలని – వేయికళ్ళతో ఎదురుచూస్తూ అతని కిష్టమైన పిండివంటలు రెడీచేస్తున్నారు.

పద్మావతమ్మగారు బయట అరుగుమీద కూర్చున్నారు. ఇంతలో విశ్వనాధంగారు బయట నుంచి వస్తూ, ''ఏమిటే, అప్పుడే కొడుకు కోసం ఎదురుచూస్తూ కూర్చున్నావా – కళ్ళు వాచి పోయాయి'' అన్నారు వేళాకోళంగా.

పద్మావతమ్మగారు వెటకారంగా, ''చెప్పొచ్చారు, ఒకసారి మీరెళ్ళి అద్దంలో మీ ముఖం చూసుకోండి'' అన్నారు.

విశ్వనాధంగారు ఆమె ప్రక్కన కూర్చుని, ''పద్మావతీ, రేపు ఈపాటికి మనబ్బాయి మన మధ్య వుంటాడు గదూ !'' అన్నారు కళ్ళలో కాంతులీనుతుండగా ? ఆ మాటలు విన్న పద్మావతమ్మగారి కళ్ళు కూడా తళ తళ లాడాయి.

''అవును'' ఆనందంతో తబ్బిబ్బు అవుతూ అన్నారామె.

''ఇదిగో. మళ్ళీ అప్పుడు చెప్పడం కుదరదు. వాడు వచ్చీరాగానే దిష్టి మాత్రం తీసెయ్యి'' అన్నారు విశ్వనాధంగారు.

ఆవిడ విరాగ్గా, ''నేనేమైనా చిన్నపిల్లనా, తెలీనట్లు చెబుతారేమిటి ? నా విషయం మీరేమి చెప్పక్కర్లేదు. వాడు బస్సు దిగేటప్పుడు జాగర్త. అసలే వెధవ బస్సుల తలుపులు రేకులు పైకి లేచి ఉంటాయి. చప్పున దిగాలనే ఆత్రుతలో చూసుకోకుండా దిగితే గీసుకుంటాయి. అలసిపోయివస్తాడు. దిగగానే వాడిచేతిలో సంచి అందుకోండి'' అన్నారు.

విశ్వనాధంగారు భార్య ముఖంలోకి వంగి, ''ఏమే, మనమింత ఆరాటపడుతున్నాముగదా ! వాడు మనకోసం ఆరాటపడుతున్నాడంటావా !'' అనేసరికి, ఆవిడకు వళ్ళెరగని కోపం వచ్చేసింది. ఒక్కసారి లేచి లోపలికి వచ్చేసింది.

విశ్వనాధంగారు అయోమయంలోపడి, ఆవిడ వెనుక లోపలికి వచ్చారు.

''ఇప్పుడు నేను ఏమన్నానని అంత కోపం'' శాంతంగా అడిగారు.

ఆవిడ తల విసురుగా తిప్పి, ''ఏమన్నానని యింకా అడుగుతున్నారా ! మనవాడిగురించి మీకు తెలీదా ! మనమంటే వాడికెంత అభిమానమో మీకు తెలియదా !'' అన్నారు.

విశ్వనాధంగారు నవ్వి ''పిచ్చి ముఖమా, తెలీక కాదే – ఊరికే అడిగాను'' అన్నారు.

అయినా ఆవిడకు కోపం తగ్గలేదు. మొదటి నుంచీ కూడా ఆమె తీరు అంతే. కొడుకు మీద




పాలవంటి తెల్లదనానికి
విమల్
వాషింగ్ పౌడర్
వాడండి!
—: డిస్ట్రిబ్యూటర్స్ :—
మహాలక్ష్మి ఏజన్సీస్
పులిపాటి వారి వీధి, విజయవాడ-1. Ph: 61505
PAPR

"WANTED STOCKISTS"



శ్రీశైల మహాక్షేత్రం




శ్రీ దేవీ నవరాత్రి
మహోత్సవములు
7-10-83 నుండి
15-10-83 వరకు
అలంకార
మహోత్సవములు

శ్రీ రుధిరోద్గారినామ సంవత్సర, ఆశ్వయుజ శుద్ధ పాడ్యమి అనగా 7-10-83వ తేది శుక్రవారం నుండి ఆశ్వయుజ శుద్ధ నవమి అనగా 15-10-83 శనివారం వరకు శ్రీ భ్రమరాంబాదేవికి వరుసగా నవదుర్గాలంకారములు అనగా "భ్రమరాంబాదేవి, బ్రహ్మచారిణి, చంద్రఘంట, స్కందమాత, కూష్మాండదుర్గ, కాత్యాయని, కాళరాత్రి, మహిషాసురమర్దని, మరియు సిద్ధిదాయిని" అలంకారములు చేయబడును.

ఉభయదాతలు రోజుకు రు. 1116/-లు చెల్లించవలయును.
శాశ్వత ఉభయము అయినచో రు 10,000/- లు
(పదివేల రూపాయలు) చెల్లించవలయును.

దాతలకు ఒకరోజు ఉచిత వసతి అయిదుగురికి భోజన వసతి మహాప్రసాదములు ఏర్పాటు చేయబడును. ఆనాడు శ్రీ స్వామివారికి మహన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకము శ్రీ అమ్మవారికి సహస్రనామ కుంకుమార్చన, శ్రీ భ్రమరాంబాదేవికి ప్రత్యేక అలంకారము సాయంత్రము శ్రీవార్లకు కళ్యాణము, పవళింపుసేవలు వారి గోత్ర నామములతో చేయబడును. ఉభయము మొత్తము ఆంధ్రబ్యాంకు లేక స్టేట్ బ్యాంకువారి డిమాండు డ్రాఫ్టు ద్వారా ఎగ్జిక్యూటివ్ ఆఫీసరుగారిపేర పంపవలసినదిగా కోరడమైనది.

(సం) యన్. చిట్టిబాబు,
కార్యనిర్వహణాధికారి.


## అపశ్రుతి

ఈగ వాలనివ్వరు. ఎప్పుడైనా కోపం వచ్చినా తనని తాను తిట్టుకునేవారే గానీ— కొడుకు నెప్పుడు తిట్టలేదు. విశ్వనాథంగారు కర్మకాలి తిడితే ఆయన కారోజు మనశ్శాంతి కరువైందన్న మాటే !

* * *

మర్నాడు —

ఉదయం పదిగంటలు.

పద్మావతమ్మగారి సలహాలు సూచనలు మనసులో దాచుకుని బస్టాండ్ చేరుకుని, ఒక మూల కూర్చున్నారు విశ్వనాథంగారు.

పదిన్నర ప్రాంతంలో బస్సు వచ్చింది. అందులో అరవింద్ కనిపించాడు. విశ్వనాథంగారు, "ఒరే బాబూ, జాగ్రత్తగా దిగు" అని అరిచాడు.

అరవింద్ బస్సు దిగాడు.

ఆ సంచీ ఇలాతే బాబూ ! వళ్ళంతా కళ్ళు చేసుకుని కొడుకును చూస్తు అన్నారు.

"పర్వాలేదు, రండి" ముందుకడుగు వేస్తూ అన్నాడు. అయినా వినలేదాయన. బల వంతంగా లాక్కున్నారు. రెండడుగులు వేసాక "హల్లో, కులాసాయేనా మధూ!" అంటూ స్నేహితుణ్ణి పలకరించాడు అరవింద్.

ముందు విశ్వనాథంగారు నడుస్తున్నారు. ఆయన వెనుక అరవింద్, మధు కబుర్లు చెప్పు కుంటూ నడుస్తున్నారు. విశ్వనాథంగారి ముఖం అదోలా మారిపోతోంది. కొడుకుతో యెన్నో చెప్పాలనుకున్న ఆయన గొంతు మూగబోయింది. ఎన్నో ఆశలు నింపుకున్న ఆయన మనస్సు ఖాళీ అయిపోయింది.

కొంత దూరం నడిచాకా, "నాన్నా ! మీరు వెళ్ళండి— నేను వెనుక వస్తాను" అన్న కొడుకు మాటలు లోపలి నరాలు తెగిపోయినంత బాధని కలిగించాయి. ఇంటి దగ్గర ఒక హృదయం తన కోసం ఎదురు చూస్తుందనే విషయం మరచి పోయాడా ! ఇంటి దగ్గర రెండు కళ్ళు కాయలు కాచేలా ఎదురు చూస్తున్నాయనే సంగతి వీడికి తెలియదా ! ఎందుకిలా తల్లిదండ్రుల ఆత్రుతని, ప్రేమని పసిగట్టని మూర్ఖుడిలా తయారయ్యాడు. తల్లిని వెంటనే చూడాలని — తండ్రిని పల్కరించాలని—లేకపోతే వారి గుండెలు బద్దలై పోతాయని తెలియదా వీడికి.

అలా ఆలోచిస్తూ ఇంటికొచ్చిన విశ్వనాథం గారు వీధి గుమ్మంలో ఎదురుచూస్తూ కూర్చున్న భార్యని చూడగానే ఆయన కళ్ళు చెమ్మగిల్లాయి.

"వాడేడి ? " అడిగారామె ఆత్రుతగా.

ఆయన ముఖం వాడిపోయి వుంది.

"మధు కనిపించాడు. వాడితో వెళ్ళాడు, ముందు నన్ను నడవమని చెప్పి వెళ్ళాడు" అనేసి అక్కడే ఉన్న పడకకుర్చీలో నడుం వాల్చాడు. గాలి తీసేసిన బెలూనులా చల్లబడిపోయింది

# అవీ... ఇవీ... అన్నీ...

## రోటరీక్లబ్ విజయవాడ వారి రాష్ట్రస్థాయి కార్టూన్ల పోటీ

పౌరధర్మాలను [సివిక్ సెన్స్] గురించి ఆలోచనలను రేకెత్తించే రాష్ట్రస్థాయి కార్టూన్ల పోటీని రోటరీక్లబ్, విజయవాడ వారు నిర్వహించనున్నట్లు, ప్రెసిడెంట్ ఆకే ఆంజనేయులు తెలియ చేస్తున్నారు. రోడ్‌మీద నడిచేటప్పుడు, వాహనాలు నడిపేటపుడు ఎటువంటి జాగ్రత్తలు తీసుకోవాలి, ఇంటా, బయటా ఎలా ప్రవర్తించాలి, మన నడవడి ఇతరులకు ఏవిధంగా వుండకూడదు, మనకు హక్కులతో పాటు నిర్వర్తించవలసిన ధర్మాలు కూడా కొన్ని వున్నాయని తెలియ చేయడం లాంటి విషయాలపై కార్టూన్లు ఈ పోటీకి ప్రధాన అంశములు. పౌరధర్మాలు గురించి ఆలోచింపచేసే కార్టూన్లు ఈ పోటీకి పంపాలి. ఉత్తమమైన వాటికి బహుమతులు ఇవ్వడమే గాక-- మరీ బాగున్న కార్టూన్లు పెద్ద బోర్డులుగా తయారు చేయించి నగరంలో పెట్టాలని నిర్ణయించుకున్నారు.

★ ఈ పోటీలో ఎవరయినా పాల్గొనవచ్చు. ఎన్ని కార్టూన్లు అయినా పంపవచ్చు. ప్రవేశ రుసుము లేదు. ప్రతి కార్టూను 15 × 20 లేదా 20 × 30 అంగుళాల సైజులో వుండాలి. రంగులలో కానీ, నలుపు, తెలుపులో కానీ వేయవచ్చు. కార్టూన్లు లోగడ ప్రచురించినవి కాకూడదు.

★ ఉత్తమ కార్టూన్లకు 500, 300, 200, 100 రూపాయలు మొదటి నాలుగు బహుమతులుగా ఇవ్వడమే గాక—మరో పదిహేను కార్టూన్లకు యాభయి రూపాయలు చొప్పున ఇవ్వడం జరుగుతుంది.

★ ఎగ్జిబిషన్‌లో ఎన్ని కార్టూన్లు అయినా, ఏవిధంగానైనా వాడుకొనే హక్కు రోటరీక్లబ్ వారికి వుంటుంది. బహుమతి పొందని కార్టూన్లు తిప్పి పంపగోరేవారు ఆ ఖర్చుకు తగిన స్టాంపులు పంపాలి. కార్టూన్లు చేరవలసిన ఆఖరు తేదీ : 30–9–1983. కార్టూన్లు పంపవలసిన చిరునామా : శ్రీ పి. ఎల్. పి. రాజు, ఛైర్మన్: ఫైన్ ఆర్ట్స్ కమిటీ, శ్రీరామా సిమెంట్ కాంక్రీట్ ప్రోడక్ట్స్ కంపెనీ, మధురానగర్, విజయవాడ – 520 011.

## వెంకట్ అవార్డు కార్టూన్ల 5వ పోటీ 1983

యువ వ్యంగ్య చిత్రకారుడు ''వెంకట్'' పేరిట అవార్డుల బహూకరణకై వ్యంగ్య చిత్ర లేఖనంలో 5వ వార్షిక పోటీని సాధన సమితి, హైదరాబాదు ప్రకటిస్తున్నది. ప్రవేశ రుసుం లేదు. ప్రతి పోటీదారు రెండు కార్టూన్లు పంపవచ్చు. ఎగ్జిబిషన్‌లో ప్రదర్శించటానికి అనువుగా 9 × 12 అంగుళాల సైజులో ఇవి ఉండాలి. ఎగ్జిబిషన్ కొరకు పాస్‌పోర్టు సైజు ఫోటో కూడా పంపవచ్చు.

రు. 516/– ల మొత్తాన్ని నలుగురు లేక అంతకన్న ఎక్కువమంది విజేతలకు పంచటమవుతుంది. ప్రోత్సాహక బహుమతులు కూడా వుంటాయి. స్టాంపులతో 9 × 12 అంగుళాల సైజులో స్వంత చిరునామా వ్రాసిన కవరును జతపరచిన పోటీదారులకు మాత్రమే ధృవపత్రాలు మొదలైనవాటిని పంపటమవుతుంది.

స్వంత చిరునామాతో పోస్టల్ కవరు పంపి ముందుగా పోటీ సమాచార పత్రం తెప్పించుకొనటానికి, ఎంట్రీలు దాఖలు చేయటానికి చిరునామా :– కార్యదర్శి, సాధన సమితి, 1–1–336/20, వివేకనగర్, చిక్కడపల్లి, హైదరాబాదు–500 020.

ఈ పోటీకి కార్టూన్లు స్వీకరించటానికి చివరి తేదీ 1983 అక్టోబరు 16.

---

ఆయన ఉత్సాహం. కన్నవారు తనకోసం ఆరాటపడతారని, తనని చూడాలని వారెంత ఎదురు చూస్తారోనన్న ఇంగితజ్ఞానం లేనివాడయ్యాడేమిటని బాధపడిపోతున్నారు పద్మావతమ్మగారు.

అలా కాసేపుచూసి, ''వస్తాడులెండి. ముందు వంట చెయ్యాలి. వాడి కిష్టమైనవి చేయాలి. ముందరే చేసి వుంచితే చల్లారి పోతాయని కూర్చున్నాను.'' అని వంటగదిలోకి వెళ్ళారామె. విశ్వనాథంగారు కూడా లేచి, ఆమెకు సహాయంగా ఉండాలని వెళ్లారు. ఎంతో రుచికరమైన వంటలు గ్యాస్ స్టవ్ మీద అరగంటలో రెడీ చేశారు పద్మావతమ్మగారు. బయటకి వచ్చి కూర్చున్నారు.

పన్నెండు గంటలయింది.

''మీరు వెళ్లి, వాడిని రమ్మని చెప్పిరండి ఎంతసేపు భోజనం లేకుండా కూర్చుంటాడు'' అన్నారు పద్మావతమ్మ.

విశ్వనాథంగారు వెంటనే, ''వస్తాడులే, నీకు ఆకలవుతే చేసెయ్యి'' అన్నారు.

''బాగానేవుంది మీరనేది. చాలాకాలం తర్వాత వాడు వచ్చాడు. కలసి తిందాంలెండి. ఒకరోజు ఆలస్యమైతే పోయిందేమీలేదు'' అన్నారామె.

విశ్వనాథంగారు భోజనం పెందరాళేచేయడం అలవాటు. భోజనం చేస్తేగాని అడుగు బయట పెట్టరు. ఉద్యోగ సమయంలో కూడా అదే అలవాటు. కానీ, ఈరోజు కొడుకుతో తినాలని ఆకలవుతున్నా ఉండిపోయారు.

పన్నెండున్నర ప్రాంతంలో వచ్చాడు అరవింద్. కొడుకుని చూసిన పద్మావతమ్మగారి ఆనందం వర్ణనాతీతం. చచ్చిపోయిన ఆనందం విశ్వనాథంగారిలో కొడుకుని చూడ్డంతో మళ్ళీ పుట్టుకొచ్చింది. పిల్లలకేం తెలుస్తుందని సరిపెట్టుకున్నారు. చాలాసేపు కబుర్లు చెప్పుకున్నారు. తర్వాత పద్మావతమ్మగారు లేచి వంటగదిలోకి వెళ్ళి కంచాలు సర్దబోయింది.

ఇంతలో అరవింద వచ్చి, ''అమ్మా, నా భోజనం అయిపోయింది మధు ఇంట్లో చేసేశాను'' అనేసి తిరిగి తండ్రి దగ్గరకి వచ్చేశాడు. కొడుకుతో కబుర్లు చెబుతూ కూర్చున్న విశ్వనాథంగారు ఆకలి చురుక్కుమనిపించింది. భార్య నుంచి కబురు రాలేదేమిటని వంటగదిలోకి వచ్చి, గోడనానుకుని తలొంచుకుని కూర్చున్న భార్యను చూసి ఆశ్చర్యపోయారు.

''పద్మావతీ, ఏమిటలా కూర్చున్నావు ?'' అడిగాడు.

ఆవిడ తల పైకెత్తింది.

ఆశ్చర్యం !!

ఆవిడ కళ్ళల్లో కన్నీరు. చలించిపోయారు విశ్వనాథంగారు. గొంతుకూర్చుని, ఏమైందే!? అడిగారు నెమ్మదిగా.

ఆవిడ చీరకొంగుతో కళ్ళు తుడుచుకుని, ''వాడు ఆ మధువాళ్ళ యింట్లో భోజనం చేసేశాట్ట'' అన్నారు.

విశ్వనాథంగారి మనసు చివుక్కుమంది. కొన్ని క్షణాలు నిశ్శబ్దంగా ఉండిపోయారు. తర్వాత తేరుకున్నారు. భార్య వైపు జాలిగా చూస్తూ, ''చూడు పద్మావతీ, దీని కెందుకింత బాధ. ఈ మాత్రం దానికే నువ్వింత ఇదైపోతే, రేపు యింకా ఇంతకంటె ఎక్కువ భరించాల్సి ఉంటుంది. గుండె రాయి చేసుకోవాలి. కొడుకులు మనల్ని ప్రేమించి, ఆదరిస్తే అదృష్టవంతులం అనుకోవాలి. అలా కాని పరిస్థితుల్లో దురదృష్టవంతులమనుకుని — వారు సుఖజీవనం గడపాలనే మనం కోరుకోవాలి. ఇది మన ఇంట కథ మాత్రమే కాదు పద్మావతీ, చాలా మందిళ్ళల్లోని కథేయిది. లే, భోజనం చేద్దువుగాని,'' అని ఆయనే కంచాల్లో వడ్డించసాగారు. ★